క్లుప్తంగా

రవాణాశాఖకు రూ.23.15 లక్షల ఆదాయం

ప్రొద్దుటూరు క్రైం : వాహనాల బహిరంగ వేలంలో రవాణా శాఖకు రూ.23.15 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో బహిరంగ వేలం నిర్వహించారు. వివిధ రకాల 44 వాహనాలను బహిరంగ వేలం వేసినట్లు ఆర్టీఓ చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

– కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్

ఖాజీపేట : రెవెన్యూ సదస్సుల్లో అందిన ప్రజా సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేయాలని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ రెవెన్యూ అధికారులకు సూచించారు. సోమవారం చెమ్ముళ్ళపల్లెలో గ్రామ సభ నిర్వహించారు. సదస్సులో ప్రజల వద్ద నుంచి వినతులను స్వీకరించారు. సమావేశంలో 40 మంది బాధితులు తమ సమస్యల పై అధికారులకు అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సుల్లో వచ్చే అర్జీలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అర్జీలను రెండు నెలల్లో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతు బజార్‌ను అందుబాటులోకి తేవాలి

ప్రొద్దుటూరు : పట్టణంలో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను రైతులకు అందుబాటులోకి తేవాలని ఏపీ రాష్ట్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు సోమవారం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా ఉందన్నారు. రైతులు పండించిన కూరగాయలు, ఇతర ఉత్పత్తులను రైతు బజార్‌లో విక్రయించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు కొత్తపల్లె యల్లయ్య, అప్పపోగుల ఎల్లయ్య, ప్రవీణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి ఆరాధన



పూజలు చేస్తున్న మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం : స్థానిక శ్రీ ఈశ్వరీదేవిమఠంలో పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, బిల్వదళార్చన, గురుపూజ విధులు చేశారు. అనంతరం వీరభద్రస్వామి సమాధి వద్ద మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి, కుటుంబ సభ్యులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ద్వార పూజ, నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈశ్వరీదేవి శిష్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుప్పిని కాపాడిన రైతులు

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె అటవీ ప్రాంతం నుంచి గ్రామ సమీపంలోకి వచ్చిన దుప్పి తెలుగుగంగ ఎడమ కాలువలో దూకింది. దీంతో స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు దుప్పిని కాలువ నుంచి రక్షించి సురక్షితంగా అడవిలో వదిలేశారు.

జనవరి 3న సర్వసభ్య సమావేశం

చాపాడు : జనవరి 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ లక్షుమయ్య అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సర్వ సభ్య సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అన్నిశాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలనీ ఎంపీడీఓ కోరారు.

రిక్షా కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

ప్రొద్దుటూరు : రిక్షా కార్మికులకు పింఛన్ ఇవ్వాలని మహాజన రాష్ట్ర సమితి వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు యామవరం చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిక్షా కార్మికులు తమ రిక్షాలను లగేజి రిక్షాలుగా మార్చుకుని మార్కెట్, షాపులు, మండీల వద్ద ఏర్పాటు చేసుకుని మూటలు, బాక్స్‌లను, ఇతర సరుకులను లబ్ధిదారులకు చేరవేస్తున్నారన్నారు. దుర్భరంగా జీవిస్తున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రిక్షా కార్మికులకు నెలకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఎస్ అమీన్ బాష, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బాలలక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎల్లయ్య, సుదర్శన్, నారాయణ, బాలుడు, డీఎస్ రాష్ట్ర నాయకుడు ఎల్లయ్య మాదిగ, సంగటి పుల్లయ్య, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం

- టీడీపీ నేతల మెప్పు కోసం వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడి దుకాణం తొలగింపు
- టీడీపీ నేతలు, మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడుతున్న కాలనీవాసులు



వైఎస్సార్‌సీపీ నాయకుడి దుకాణాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలో టీడీపీ నేతల కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. తమ ఆధిపత్యానికి అడ్డుగా ఉంటున్నారన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇందుకు అధికారులు సైతం సహకారం అందిస్తున్నారు. ఆ కోవలోనే పట్టణంలోని చెన్నంపల్లె సమీపంలో గత కొన్నేళ్లుగా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు చెన్నయ్యకు చెందిన దుకాణాన్ని సోమవారం పోలీసు బందోబస్తు నడుమ మున్సిపల్ అధికారులు తొలగించారు. టీడీపీ నేతల ఒత్తిడితోనే 20 ఏళ్లగా ఉన్న తన దుకాణాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారని చెన్నయ్య వాపోయాడు.

దళిత నాయకుడిపై కక్ష సాధింపు

మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ రమాదేవి మామ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడిగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి శీలిచెన్నయ్య పనిచేస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ మీద ఎనలేని అభిమానంతో వరుసగా రెండు పర్యాయాలు తన కోడలిని కౌన్సిలర్‌గా గెలిపించారు. అంతేకాకుండా సార్వత్రిక ఎన్నికల్లో సైతం వార్డులో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ తీసుకొచ్చారు. దీనిని జీర్ణించుకోలేని అధికార పార్టీ నేతలు చెన్నయ్యపై కక్ష కట్టారు. ఆ కోవలో టీడీపీకి చెందిన కౌన్సిలర్‌తో మున్సిపల్ సమావేశంలో అనేకమార్లు ఫిర్యాదు చేయించారు. అయితే చెన్నయ్య ఏర్పాటు చేసిన దుకాణం ఎవరికి ఇబ్బందులు లేకుండా ఉండటంతో గతంలో పనిచేసిన మున్సిపల్ అధికారులు సైతం దానిని పెద్దగా పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన 33వ వార్డు కౌన్సిలర్ ద్వారా మళ్లీ ఫిర్యాదు చేయించడంతో పాటు కమిషనర్‌పై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో చెన్నయ్య కోడలిని టీడీపీలో చేరాలని ఒత్తిడి తేవడంతో అందుకు చెన్నయ్య నిరాకరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చెన్నయ్యపై కక్ష కట్టి మరీ జీవనాధారంగా ఉన్న దుకాణాన్ని తొలగించాలని మున్సిపల్ అధికారులకు టీడీపీ ముఖ్య నేత అల్టిమేటమ్ జారీ చేసినట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ అధికారులు ఆగమేఘాల మీద పోలీసు బందోబస్తుతో వెళ్లి దుకాణం మూసివేసి ఉన్న సమయంలో జేసీబీతో తొలగించారు. ఈ ఘటనలో దుకాణంలోని వస్తువులు, సరుకులు, సామాన్లు చిందరవందరగా పడిపోయాయి. మున్సిపల్ అధికారులు తొలగించిన చెన్నయ్య దుకాణానికి పది మీటర్ల దూరంలోనే డ్రైనేజీని ఆక్రమించి పర్మినెంట్ నిర్మాణాలు ఉన్నప్పటికీ వాటిని మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

వైఎస్సార్‌సీపీ 27వ వార్డు కౌన్సిలర్ మామ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు శీలిచెన్నయ్యకు చెందిన దుకాణాన్ని మున్సిపల్ అధికారులు తొలగించిన విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలో అనేక ప్రాంతాల్లో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు ఉన్నప్పటికీ.. కేవలం చెన్నయ్యకు చెందిన దుకాణాన్ని మాత్రమే తొలగించడం కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని అన్నారు. ఘటనపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

దళితులపైనా ప్రతాపం



టీడీపీ నేతలు, మున్సిపల్ అధికారులు పట్టణంలో అనేక చోట్ల అక్రమ నిర్మాణాలు ఉన్నా, వాటిని పట్టించుకోకుండా దళితులమైన మాపైన ప్రతాపం చూపడం సరికాదు. ఏళ్ల తరబడి జీవనాధారంగా ఉన్న దుకాణాన్ని కక్ష కట్టి మరీ తొలగించడం దారుణం. అధికారులు కూడా టీడీపీ నేతల చెప్పుచేతల్లో పని చేస్తున్నట్లు స్పష్టమవుతుంది.
– శీలిరమాదేవి, 27వ వార్డు కౌన్సిలర్

ప్రాణం పోయినా పార్టీ మారేది లేదు



చెన్నంపల్లె సమీపంలో గత 20 ఏళ్లుగా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నా. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ టీడీపీ నేతలు కక్ష కట్టి మరీ దుకాణాన్ని తొలగింపజేశారు. టీడీపీలో చేరమని ఒత్తిళ్ళు చేసినా అందుకు తలొగ్గలేదని మాపై కక్ష కట్టారు. ప్రాణం పోయినా పార్టీ మారేది లేదు.
– శీలిచెన్నయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు

కరెంటు బిల్లుల పెంపును వరద సమర్థించుకోవడం దారుణం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కరెంట్ బిల్లుల పెంపును ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమర్థించుకోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, ఈ కారణంగానే కరెంటు ఛార్జీలు పెంచారని చెప్పారన్నారు. దీనిని బట్టి ఎమ్మెల్యే ఓట్లేసిన ప్రజలను వదిలేసి ప్రభుత్వాన్ని సమర్థిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. సోమవారం వైఎంఆర్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 85 ఏళ్ల వయసులో ఎమ్మెల్యే కావడానికి ప్రజలే కారణమన్న విషయాన్ని ఆయన మరిచిపోయారన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యుత్ చార్జీలను పెంచబోమని, నాణ్యతగల కరెంట్ ఇస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పుడే రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. ప్రజలను డెకాయిట్లు, దొంగనాకొడుకులు అని గతంలోనే చెప్పిన వరదను మళ్లీ ప్రజలు గెలిపించారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కార్యాలయం ఉన్న నెహ్రూ రోడ్డు కూడా తమ హయాంలో అభివృద్ధి చేశామని తెలిపారు. వాసుదేవపురం, గాదెగూడూరు, నంగనూరుపల్లె, ఉప్పరపల్లె, బొజ్జవారిపల్లె గ్రామాలకు తాను వేసిన రోడ్లపైనే మీరు ఎన్నికల ప్రచారానికి వెళ్లారని ఎమ్మెల్యే వరదను ఉద్దేశించి మాట్లాడారు. తాను మంజూరు చేయించిన కొన్ని పనులను దౌర్భాగ్యంగా మీరే ప్రస్తుతం చేసుకుంటున్నారన్నారు. మీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన అమృత్ పథకాన్ని తాను పూర్తి చేయించి ప్రజలకు తాగునీటిని అందిస్తున్నానని తెలిపారు. ఇందులో మున్సిపాలిటీ వాటా ఎక్కువగా ఉందన్నారు. అమృత్ పథకానికి సంబంధించి ప్రతి నెల మున్సిపాలిటీ రూ.75 లక్షలు చెల్లిస్తోందన్నారు. తాను మంజూరు చేయించిన రూ.500 కోట్ల అభివృద్ధి పనుల్లో స్థానిక సంస్థల వాటా లేదని తెలిపారు. ఎమ్మెల్యే వరదకు చేతనైతే కూటమి ప్రభుత్వం రద్దు చేయించిన డ్రైనేజీ కాలువల ఆధునీకరణతోపాటు పైపులైన్ పనులను మంజూరు చేయించాలని కోరారు. రూ.320 కోట్లతో తమ ప్రభుత్వంలో మంజూరైన ఈ పనులను నిబంధనల ప్రకారం తగిన శాతం కాకపోవడంతో ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంజి, జంగమయ్య, బీఎస్ఆర్ పాల్గొన్నారు.

నేడు రాత్రి పోలీసు ఆంక్షలు

- ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం



ప్రొద్దుటూరు క్రైం : కొత్త సంవత్సర వేడుకలను ఎవరికి ఇబ్బంది కలిగించకుండా సంతోషంగా జరుపుకోవాల ని ప్రొద్దుటూరు డీఎస్పీ ఎం.భక్తవత్సలం తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి 9 గంటల నుంచి పట్టణంలో పోలీసుల ఆంక్షలు అమలు చేస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు. బైక్‌ల సైలెన్స్‌లను తొలగించి ఎక్కువ శబ్దాలతో నడిపితే సీజ్ చేస్తాం.
- రాత్రి 10 గంటల తర్వాత పట్టణంలోని అన్ని ప్రధాన సెంటర్లలోను, బార్ల వద్ద పోలీసులు బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తారు. అవసరం అయితే తప్ప రాత్రి బయటికి రాకూడదు. మద్యం సేవించి వాహనాలు నడపరాదు.
- అన్ని స్టేషన్‌ల పరిధిలోని ముఖ్యమైన సెంటర్లలో పోలీస్ పికెట్ ఏర్పాటు.
- అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలను నడపరా దు. ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు.
- తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. మైనర్లకు బైక్‌లు ఇచ్చి బయటికి పంపించరాదు. మైనర్లు పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.
- బహిరంగ ఈవెంట్స్, డీజేలకు 31 రాత్రి అనుమతి లేదు. ఇండోర్‌లో వేడుకలు జరుపుకునేవారు పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

బద్వేలు అర్బన్ : నూతన సంవత్సర వేడుకలలో భాగంగా 31వ తేది అర్ధరాత్రి ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని బద్వేలు అర్బన్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, అలా కాకుండా మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి హంగామా సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోరుమామిళ్ల: నూతన సంవత్సర వేడుకలు శృతిమించితే కఠిన చర్యలు తప్పవని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 31 వ తేది రాత్రి పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

ప్రైవేటు ఆసుపత్రి తనిఖీ



ప్రైవేటు ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సోమవారం అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ఆసుపత్రిపై వచ్చిన పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగుల వద్ద నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, అర్హత లేకున్నా ఎన్టీఆర్ వైద్యసేవ మంజూరు చేశారని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ చేపట్టామని, పూర్తిస్థాయిలో విచారించి నివేదికను వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు పంపడంతో పాటు ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్‌కు అనుమతులపై నివేదిస్తామని తెలిపారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జె.వినయ్‌కుమార్, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

మైదుకూరు : మున్సిపాలిటీలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో చైర్మన్ చంద్ర అధ్యక్షతన మున్సిపాలిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమస్యలపై నిర్లక్ష్యంగా ఉండవద్దని అన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులను సమానంగా చూస్తూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఖాళీగా ఉన్న మున్సిపాలిటీ స్థలాను గుర్తించి వాటిని మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. స్థానిక నంద్యాల రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రం, మున్సిపల్ బోరువద్దకు వెళ్లేందుకు దారి లేకుండా చేస్తున్నారని 18వ వార్డు కౌన్సిలర్ కోటిపాటి పార్వతి ఫిర్యాదు చేశారు. దానిపై మున్సిపల్ చైర్మన్ చంద్ర మాటాట్లాడుతూ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.

రూ.16.77 కోట్లతో బడ్జెట్

మైదుకూరు మున్సిపాలిటీకి 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.16,77,21,164తో బడ్జెట్‌ను తయారు చేశారు. 2024–25లోని సవరించిన అంచనాల నుంచి 2025–26 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను తయారు చేసినట్టు ఈ సందర్భంగా కమిషనర్ జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ బడ్జెట్ అంచనాలను సోమవారం జరిగిన అత్యవసర సమావేశంలో సభ్యుల దృష్టికి తీసుకొచ్చి ఆమోదానికి ఉంచారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత మోటార్లు, పైపులు ఏమయ్యాయి?

మైదుకూరు మున్సిపాలిటీలోని నీటి పథకాలకు చెందిన పాత మోటార్లు, పైపులు ఏమయ్యాయో విచారణ జరిపించాలని సోమవారం జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశం సందర్భంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కమిషనర్ శ్రీనివాసుల రెడ్డిని కోరారు. ఆమేరకు మున్సిపల్ వైస్ చర్మన్లు మహబూబ్ షరీఫ్, మూలే రేణుక, కౌన్సిలర్లు ఇందిరా రమణి, కోటపాటి పార్వతి, గౌసియా, మాబున్నీ, లక్ష్మీప్రసన్న కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అవి ఏమయ్యాయి. మైదుకూరు మున్సిపాలిటీలో ఏడాది కిందట డీఎంఎఫ్ గ్రాంట్ కింద 40 కొత్త మోటార్లను తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తెలిపారు. వాటిని తాగునీటి పథకాలకు అమర్చి అంతకుముందు ఉన్న పాత మోటార్లను, పైపులను, కేబుళ్లను తీసుకొచ్చి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న గోదాములు భద్రపరిచారని వివరించారు. అయితే అవి ప్రస్తుతం కనిపించడం లేదని పేర్కొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే పార్టీకి, పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌసియాబేగం, సుందరయ్య, రవి, చిన్నయ్య, రాహుల్ పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర హోంమంత్రి పదవి నుంచి తక్షణమే తొలగించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం.చిన్ని పేర్కొన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాలలో భాగంగా రాజ్యసభలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, మోక్షమ్మ, అనంతమ్మ, ఖైరున్, సుబ్బరాయుడు, గురుదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : రాజ్యాంగ నిర్మాత అంబెడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ అరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసనలో భాగంగా సోమవారం బీ.మఠం ఐదు రోడ్ల కూడలిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రమణమ్మ, ప్రసాద్, హరి, చిన్నప్ప, గురు, శీను, వెంకటేశ్, రామోహన్, గురువయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



సైన్స్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, న్యాయ నిర్ణీతలు

మైదుకూరు : మైదుకూరులోని జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం జరిగిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నుంచి మూడు విభాగాల్లో ఒక్కో ప్రాజెక్టును జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేశారు. మండలంలోని పాఠశాలల నుంచి విద్యార్థులు తీసుకొచ్చిన సైన్స్ ప్రాజెక్టులతో జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ప్రదర్శనకు ఉంచిన ప్రాజెక్టులను ఎంఈఓ –2 నరహరిశర్మ, జెడ్పీ గరల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని, బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోశెట్టి రామమోహన్ పరిశీలించారు. వీటిలో వ్యక్తిగత విభాగంలో కస్తూరిబా పాఠశాలకు చెందిన విద్యార్థిని నిహారిక తయారు చేసిన అగ్రికల్చర్ మోటార్ కంట్రోల్ ప్రాజెక్టును న్యాయ నిర్ణీతలు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. గ్రూప్ విభాగంలో మైదుకూరు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు పి.నాగభవేష్, పి.బాబు, సందీప్ తయారు చేసిన ఆల్కహాల్ సెన్సింగ్ అలెర్ట్ ఇంజిన్ ప్రాజెక్టును, టీచర్ విభాగంలో మైదుకూరు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు సురేంద్ర నాయక్ తయారు చేసిన చంద్రయాన్ –3 ప్రాజెక్టును జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయుడికి ఎంఈఓలు పద్మలత, నరహరి శర్మ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాలు ఎల్.సూర్యనారాయణరెడ్డి, మీసాల మునయ్య, ఆనంద్ కుమార్, విజయ్ కుమార్, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కలసపాడు : కలసపాడులోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 2025–26 నూతన విద్యా సంవత్సర క్యాలెండర్, డైరీ స్టిక్కర్లను మండల విద్యాశాఖాధికారి ఎస్.మస్తాన్ వల్లి ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈరిబాలజోజి, మండల అధ్యక్షుడు జి.బాలఓబయ్య, ప్రధాన కార్యదర్శి సుమనయ్య, ట్రెజరర్ సురేష్‌రవికుమార్, గౌరవ సభ్యులు కె.వి.సుబ్బారెడ్డి, కౌన్సిలర్ ఎస్.గురయ్య, వెంకటసుబ్బయ్య, బి.ప్రభాకర్, మహబూబ్‌హుస్సేన్, రమేష్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : ఎస్టీయూ రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీలను సోమవారం సాయంత్రం ఫారెస్ట్ రేంజర్ రఘునాథరెడ్డి, ఎంఈఓలు ఆవిష్కరించారు. పోరుమామిళ్ల ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో రీజనల్ కన్వీనర్ క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, వైద్యులు రమణారెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు చంద్రహాసరెడ్డి, శేఖర్‌బాబు, పుల్లారెడ్డి, శ్రీనివాసులు, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఖాజీపేట : ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సూచించారు. సోమవారం పుల్లూరు పంచాయతీలోని సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. అక్కడ సిబ్బంది కనిపించకపోవడంతోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో అందుబాటులో లేని ఏఎన్ఎం, అగ్రికల్చర్ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మన్‌లు హాజరు పట్టికలో కార్యాలయానికి రానట్లు రాశారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ వివిధ రకాల పనులు, సమస్యలతో కార్యాలయానికి వస్తారని, అక్కడ సిబ్బంది లేకపోతే ఎలా అన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు సిబ్బంది వెళ్లరాదన్నారు. ప్రజలకుల అందుబాటులో ఉండాడి సేవలు అందించాలన్నారు.

విపంచిక పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో సోమవారం పట్టణానికి చెందిన రచయిత డాక్టర్ పెరుగు భవాని శంకర్ రచించిన విపంచిక అనే కావ్యాన్ని శాసన మండలి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. దేశ భక్తి, సంస్కృతి పరిరక్షణ ధ్యేయంగా విపంచిక పుస్తకం సమాజంలో చైతన్యం నింపుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రచయిత భవాని శంకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ రావు, సినీ గేయ రచయిత భువన చంద్ర, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరునికి భస్మార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ప్రదోశ కాలంలో అగస్త్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, సుగంధ పూజా ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, విశేషంగా భస్మంతో అభిషేకించారు. అనంతరం స్వామికి హారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు డివేడ్ రాజ్, జిల్లా అధ్యక్షుడు రాహుల్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జీఓ నంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, రాము, బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

అట్లూరు : ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టి.. ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో సోమవారం బద్వేలుతో పాటు, అట్లూరు, గోపవరం, సిద్దవటం మండల వ్యవసాయ అధికారులతో పాటు సమగ్ర నాణ్యత పరీక్షా కేంద్రం సిబ్బంది, రైతు సేవాకేంద్రాల వ్యవసాయ సహాయకులతో శిక్షణతో పాటు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్న రైతలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రామకృష్ణయ్య, రమేష్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దారెడ్డిపల్లె పంచాయతీలో పారిశుద్ధ్య పనులు

చాపాడు : మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె గ్రామంలో సోమవారం పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. సర్పంచ్ బి.సరోజమ్మ ఆధ్వర్యంలో సిద్దారెడ్డిపల్లెతో పాటు ద్వారకానగరం గ్రామంలో డ్రైనేజీ కాలువలలో పూడిక తీత పనులు చేపట్టారు. ఇదే క్రమంలో కాలువలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ద్వారకానగరం వద్ద గల దళితవాడలోని కాలువలో జేసీబీ సాయంతో పూడిక తీయించారు. పనులను పంచాయతీ కార్యదర్శి సుమలత, ఆశ వర్కర్, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు.

విద్యా రంగ పరిరక్షణకు కృషి

మైదుకూరు : ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తోందని ఎంఈఓ పద్మలత, ప్రధానోపాధ్యాయురాలు గంగా భవాని పేర్కొన్నారు. సోమవారం మైదుకూరులో యూటీఎఫ్ ముద్రించిన డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, జిల్లా కార్యదర్శి ప్రసన్న లక్ష్మీ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఫైజర్ బాష, అనిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ తెలిపారు. సోమవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్చేంజ్ కార్యాయలంలో భాగంగా విశాఖ పట్నంకు చెందిన విద్యార్థులు పట్టణంలోని వికసిత ఫౌండేషన్, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యాలయాలను సందర్శించారు. ఆ సేవా సంస్థలు నిర్వహిస్తున్న సామాజిక సేవాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, శివప్రసాద్, దేవిక, భారతి, లక్ష్మీదేవి, మహి, ప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.